విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం 25, సెప్టెంబరు -2025 8 పేజీలు

పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

ఆయుధాలు నాణ్యతగా ఉంచుకోవాలి - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

విశాలాంధ్ర-రాయచోటి:పోలీసులు విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఆయుధాలు నాణ్యతగా ఉంచుకోవాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని ముఖ్యమైన విభాగాలను బుధవారం సందర్శించారు. ఆయుధాల గది, స్టోర్ రూమ్, అడిషనల్ ఎస్పీ, ఏఆర్ డిఎస్పీ, ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ వెల్ఫేర్,

2లో

ప్రభుత్వ భూమి చదును..!

- కూటమి శ్రేణుల బరితెగింపు
- చేష్టలుడిగిన రెవిన్యూ శాఖ
- ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు..
- చట్టపర చర్యలు తీసుకుంటాం..
- ఆర్‌డిఓ చిన్నయ్య వివరణ

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : అధికారం మాది.. అడిగే దెవరోచూద్దాం.. అన్న ధీమానో..! మళ్లీ అవకాశం వస్తుందో.. రాదోనన్న అనుమానమో.. కారణం ఏదైనా..! కూటమి దండు దాడి తీవ్రం చేస్తోంది. ప్రభుత్వ భూమి కబ్జాకు తెరలేపింది.. అక్కడ.. ఇక్కడనే తేడా లేకుండా అడ్డూ అదుపూ లేని అక్రమణ పర్వం కొనసాగిస్తోంది.. కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వీరపు నాయుని పల్లె మండలం ఉరుటూరు రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1151లో గల ప్రభుత్వ పోరంబోకు భూమిపై కన్నేసిన అధికార పార్టీ కూటమి శ్రేణులు కొందరు సదరు భూమిని యంత్రాల సాయంతో చదును చేస్తున్న వైనం ఈ ప్రాంత ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సుమారు నూరు ఎకరాలు గల ఈ పోరంబోకు గుట్ట భూమి ఎల్లంకూరు పల్లె-గార్ల మిట్టపల్లె గ్రామాల మధ్య ఉంది. దీనిని హస్త గతం చేసుకొనేందుకు కొందరు కూటమి శ్రేణులు బరితెగించి తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారం మండల రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ నియోజకవర్గానికి చెందిన ప్రస్తుత తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి ప్రభుత్వ స్థలాలు, భూములను ఆక్రమిస్తే తాము ఉపేక్షించబోమని, న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయిస్తామని చెప్పిన మాటను ప్రస్తుతం పలువురు గుర్తు చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి భూకబ్జాలపై ఆ పార్టీ నాయకులను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించిన ఉదంతాలను మరికొందరు

జ్ఞాపకం చేస్తున్నారు. తాజాగా ఈ వంద ఎకరాల కూటమి శ్రేణుల భూకబ్జాపై ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలని ప్రజలు భావిస్తున్నారు. ఈ భూకబ్జాపై పలువురు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో పాటు సంబంధిత రెవెన్యూ మంత్రి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. పుత్తా నరసింహారెడ్డి సైతం ఈ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తారో వేచి

2లో

ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలి

కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను.. సమర్ధవంతంగా అమలు చేసి.. ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనలో భాగంగా.. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. "నీతీ ఆయోగ్" ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆకాంక్ష జిల్లా, బ్లాకుల్లో.. వైఎస్ఆర్ జిల్లాలో సామాజిక స్థాయిని.. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. ఇప్పటికే కొన్ని విభాగాలలో ఆయా ప్రమాణికాల్లో లక్ష్యం సాధించామని, ఇంకనూ కొన్ని శాఖల్లో అన్ని పారామీటర్లలో 100% లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అలాగే ఆకాంక్ష బ్లాకుల లక్ష్యసాధనలో భాగంగా

2లో

మరుగునపడిన చిరుకళాకారుల నృత్యాలు..ఉపాధి కోల్పోయిన నర్తకీమణులు

విశాలాంధ్ర-పులివెందుల: ఒకప్పుడు గ్రామీణులకు వినోదాన్ని అందించిన చిరుకళాకారుల నృత్యాలు మరుగునపడ్డాయి, దీంతో వాటిపై ఆధారపడి జీవనం సాగించే నర్తకీమణులు ఉపాధికోల్పోయారు. ముఖ్యారు పంటలు పండించే సందర్భంలో అటు రైతులు ఇటు వ్యవసాయ కూలీలు నిండు పాదిగా ఉన్నప్పుడు కొంత మంది చిరుకళాకారులు కాసిన్ని ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు రికార్డింగ్ డ్యాన్సులు చేసేవారు. కాలగమనంలో ఉర్రూతలూగించిన ఆ సందడి కేవలం జ్ఞాపకాలకే పరిమితమైంది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో శుభకార్యాలు, ఉత్సవాలు, జాతరలు ఏవైనా జరిగితే రికార్డింగ్ డ్యాన్స్ తప్పనిసరి వినోదంగా ఉండేది. వీధి గల్లీల్లో పెద్ద సౌండ్ బాక్స్, జనాన్ని ఆకట్టుకునే పాటలు, ఆ తాళానికి డ్యాన్స్ చేసే చిరు కళాకారులు అలా ఒక ప్రత్యేక వాతావరణం ఏర్పడేది. అయితే కాల క్రమేణా ఈ కళాకారుల పరిస్థితి మారిపోయింది. సామాజిక మాధ్యమాల విస్తరణ, ఆధునిక వినోదాల ఆవిర్భావం, అలాగే పట్టణ సంస్కృతి ప్రభావం కారణంగా రికార్డింగ్ డ్యాన్స్ ప్రదర్శనలు మరుగునపడ్డాయి. నేటి తరానికి ఈ కళ అజ్ఞాతమే అయిపోయింది. ఇకపోతే, ఈ కళను ప్రదర్శించే వారిని కొన్ని ప్రాంతాల్లో చులకనగా చూసే దురవస్థ ఒకప్పుడు నెలకొంది. వాస్తవానికి

2లో

ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి లీజ్ ప్రాతిపదికన భూముల కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూకేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్

2లో

"లోక్ కళ్యాణ మేళా"ను సద్వినియోగం చేసుకోండి - కమిషనర్

విశాలాంధ్ర-రాజంపేట : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన "లోక్ కళ్యాణ మేళా"ను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పీ.ఎం స్వనిధి 2.0లో భాగంగా వీధి విక్రయదారులకు రుణ సదుపాయాలు, క్రెడిట్ హామీ, వడ్డీ సబ్సిడీ, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలిపారు. మొదటి విడతలో రూ.15,000, రెండవ విడతలో రూ.25,000 రుణాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా యు.పి.ఐ లింక్ రూపే క్రెడిట్‌కార్డులు గరిష్టంగా రూ.30,000 వరకు అందజేస్తారని తెలిపారు. లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు మాట్లాడుతూ పీ.ఎం శ్రమ యోగి మందాన్ పెన్షన్, పీ.ఎం సురక్ష భీమా యోజన, పీ.ఎం జీవన్ జ్యోతి భీమా యోజన, పీ.ఎం జనధన్ యోజన వంటి పథకాల ద్వారా ప్రతి అసంఘటిత రంగ కార్మికులు ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ అయ్యవారయ్య, ఐసిఐసిఐ బ్యాంకు ప్రతినిధులు, మున్సిపల్ , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి చదును..!

మొదటి పేజీ తరువాయి

చూడాల్సి ఉంది.

చట్టపర చర్యలు తీసుకుంటాం - ఆర్‌డిఓ చిన్నయ్య

భూకబ్జా వ్యవహారంపై పులివెందుల ఆర్‌డిఓ చిన్నయ్యను వివరణ కోరగా ఈ అంశంపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కబ్జాదారులపై చట్టపర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలి

మొదటి పేజీ తరువాయి

సికె దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల ఆశయ సాధన లక్ష్యాలను సంతృప్త స్థాయిలో.. సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కృషి చేయాలన్నారు. అందులో భాగంగా ప్రధానంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్ విభాగంలో జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న, జరిగిన ప్రగతిపై ఎడిపి యంగ్ ప్రొఫెషనల్ విష్ణుతేజ పిపిటి ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. అంతేకాకుండా ఎడ్యుకేషన్, వ్యవసాయం - అనుబంధ రంగాలు, ఆర్థిక రాబడులు - స్కిల్ డెవలప్ మెంట్, కనీస మౌలిక సదుపాయాల కల్పన.. మొదలైన రంగాల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీపీవో హజరతయ్య, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల అధికారులు.. డా. నాగరాజు, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి, ఐసిడిఎస్ పీడి రమాదేవి, స్మార్ట్ కిచెన్స్ నోడల్ పర్యవేక్షక అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల ఏడీపీ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి

ఏంటిఓ, స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్బీ, సైబర్ సెల్, ఐటీ కోర్ టీమ్, స్పెషల్ పార్టీ, మహిళా పోలీస్ స్టేషన్, ట్రిబుల్ సీ, కమ్యూనికేషన్, అడ్మినిస్ట్రేషన్, హోంగార్డ్స్ కార్యా లయాలను సందర్శించారు. బెల్ ఆఫ్ ఆమ్స్‌లోని ఆయుధాల సంఖ్య, రకా లు, మందుగుండు సామాగ్రి, స్టోర్ రూమ్‌లోని అత్యవసర సామాగ్రి వంటి అన్ని అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఆయుధాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచు కోవాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. డయల్-112 కంట్రోల్ రూమ్ వ్యవస్థ పనితీరును పరి శీలించారు. సీసీటీవీ కెమెరాలు ఎక్కడ పని చేస్తున్నాయి? ఎక్కడ పనిచేయడం లేదు? పనిచేయని వాటిని వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ వెంట ఏఎస్ జె.త్రినాథ సత్యం, ఎస్బి సిఐ పి.రాజా రమేష్, డీసీఆర్బీ సీఐ యం.తులసిరామ్, క్రైమ్ సీఐ చంద్రశేఖర్, టాస్క్ ఫోర్స్ సీఐ టి. మధు, సైబర్ సెల్ %ఒ% సోషల్ మీడియా సీఐ ఎస్.మహమ్మద్ అలీ, టెక్నికల్ అనాలసిస్ వింగ్ ఆర్ఐ టి. జాన్ జోషఫ్, యంటీఓ ఆర్ఐ యం. పెద్దయ్య, యస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

మొదటి పేజీ తరువాయి

ప్రైవేట్ లిమిటెడ్ వారికి గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం గతంలో భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించారు. ఈ గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ సంబంధించిన తూము గుంట, వెలిగల్లు కు సంబంధించిన లీజ్ ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తయారుచేసి ఫైళ్లను వేగవంతం చేయాలని, శనివారం లోపు నివేదికలను పంపే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

విశాలాంధ్ర -సింహాద్రిపురం : మండల పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా బుధవారం నాడు ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు సరైన పత్రాలు ఉంచుకునే రోడ్లపైకి రావాలన్నారు లేకపోతే చలానాలు విధిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే వారి పైన కేసు నమోదు చేస్తామన్నారు. వాహనదారులకు సరైన పత్రాలు లేని వారికి చలానా విధించమన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను సవరణించాలని

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

విశాలాంధ్ర -రాజంపేట : రాష్ట్రంలో కార్మికుల పనిగంటలను 8 నుంచి 13కు పెంచుతూ శాసన సభ, శాసనమండలి చేసిన తీర్మానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా కనీస వేతనాలను ప్రభుత్వం సవరించలేదని, తక్షణమే కనీస వేతనాలను ప్రస్తుత ధరలకనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే అందుకు విరుద్ధంగా కార్మిక వ్యతిరేక చర్యలకు కూటమి ప్రభుత్వం పూనుకుంటున్నదని విమర్శించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల శ్రమను దోపిడి చేసేం దుకు పని గంటలు పెంచిందని ఆరోపించారు.కార్మికులకు నష్ట దాయ కంగా పనిగంటలను, పని విస్తృతిని పెంచడం, ఓవర్ టైమ్ కాలాన్ని రెట్టింపు చేయడం, మహిళల చేత రాత్రి పూట పని వంటివి పెట్టుబడిదారులకు ప్రయో జనం కలిగించడానికే మహిళలకు కల్పిం చాల్సిన సౌకర్యాలను రక్షణను యాజమాన్యాలు కల్పించడం లేదన్నారు.యాజమాన్యాలు మరింత దోపిడీ

చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐ టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు సహాయ కార్యదర్శి రమణ, సురేష్, మౌలా, నరసిం హులు,రవి రాఘవేంద్ర, రమేష్, తులసినాయక్, అంజితదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డబ్ల్యూ.ఆర్ కరణం శివ శంకర్ నాయుడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట : డబ్ల్యూ. ఆర్ కరణం శివ శంకర్ నాయుడు ఎం.జి.ఎఫ్ అడ్వకేట్ జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక బి.వి.ఎన్ పాఠశాలలో రాజంపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఉపాధ్యక్షులు డబ్ల్యూ.ఆర్ కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ రాజంపేట 500 మంది సభ్యులు కలిగిన గొప్ప క్లబ్ అని, రాజంపేట చుట్టు ప్రక్కల ప్రాంతాలలో విరివిగా మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు, సాధారణ వైద్య శిబిరాలు, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. శివశంకర్ నాయుడు నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ చరిత్రలో ఒకే రోజు 108 మంది సభ్యత్వం పొందడం సభ్యుల భ్రాతృత్వానికి నిదర్శనం అన్నారు. బ్రిటిష్ కాలం నాటి సంప్రదాయన్ని పక్కన పెట్టి కరణం శివ శంకర్ నాయుడు జన్మదిన్నాన్ని ఒక వినూత్న మైన సంప్రదాయంతో కేకు బదులు పండ్లు కోసి నిర్వహించుకోవడం శుభ పరిణామమన్నారు. భవిష్యత్తులో ప్రజలందరూ తమ పుట్టినరోజు వేడుకలు కేక్ లు కట్ చేసి సంబరాలు జరుపకుండా స్వచ్ఛమైన, తాజా పండ్లును కట్ చేసి నిర్వహించాలని, నేడు పుచ్చకాయను కట్ చేసి జరుపుకోవడం జరిగిందని వివరించారు. అనంతరం పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరామ రాజు, వెంకటయ్య నాయుడు, డబ్ల్యూ.ఆర్ అమ్మినేని వెంకటయ్య నాయుడు, చేజర్ల సుబ్రహ్మణ్యం రాజు .సుబ్బరామ రాజు, డబ్ల్యూ.ఆర్ దగ్గుపాటి రవి, శివ రామ రాజు, సుబ్బరాజు, శ్రీనివాసులు నాయుడు, జయచంద్ర రాజు, రఘువీర్ రాజు, కొమ్మి రామచంద్ర, ఎస్.రామచంద్ర రాజు, రెడ్డయ్య, బాలాజీ, మేడికొండు రవి, నాసర్, మురళి, మోహన్ రాజు, సుధీర్, మల్లిఖార్జున, అమర్, శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత తొలగించండి ..గ్రామస్తులు ఆవేదన

విశాలాంధ్ర-సిద్దవటం : గ్రామాల్లో అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన మొదలై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కడ పాయపల్లె గ్రామంలో పలు రహదారిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన మొదలైందని గ్రామస్తుల తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య బుధవారం మాట్లాడుతూ కడ పాయపల్లె ఎస్సీ కాలనీ, మరియు ప్రధాన రహదారి నందు అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన మొదలైన కూడా తొలగింపు చేపట్టలేదని పారిశుద్ధ కార్మికులకు గత కొన్ని నెలలుగా నెలసరి వేతనాలు అందించక సిబ్బంది పారిశుద్ధ్యం తొలగింపు చేపట్టలేదని గ్రామంలో అంటువ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం తొలగింపు పై మండల విస్తరణ అధికారి మెహతాజ్ యాస్మిన్ వివరణ కోరగా కడ పాయపల్లె గ్రామంలో ఉన్న అపరిశుభ్రత తొలగింపు చేపట్టేందుకు చర్యలు చేపట్టి అంటు వ్యాధులు సోకకుండా ఆ ప్రాంతంలో బ్లీచింగ్, అబెట్ పిచికారి చేస్తామని తెలిపారు.

ఉపాధి కోల్పోయిన నర్తకీ మణులు

మొదటి పేజీ తరువాయి

వారు ఎంచుకున్న వృత్తి కేవలం వారి బతుకు తెరువు కోసమే. కానీ కళాకారుల పట్ల గౌరవం కరువవడంతో, క్రమంగా వారి జీవనోపాధి దెబ్బతింది. నేటి పరిస్థితుల్లో ఈ వృత్తి దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుంది. అయితే ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు వీరిని ప్రోత్సహిస్తే, మళ్ళీ ఈ కళ వెలుగులోకి రావచ్చు. గ్రామీణ కళా సంపదలో ఒక ప్రత్యేక భాగంగా నిలిచిన రికార్డింగ్ డ్యాన్స్ మళ్లీ పునరుజ్జీవించడానికి ప్రోత్సాహం, ఆర్థిక సహకారం అవసరం. ఆధునిక వినోదాల మధ్య మరుగునపడిన ఈ చిరు కళాకారులు, సమాజం నుంచి గౌరవం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తే, నృత్య ప్రదర్శనల ద్వారానే తిరిగి జీవనోపాధి పొందగలరు.

మసీదు అక్రమ నిర్మాణం.?

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని అక్కంపల్లె జగనన్న కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మసీదు నిర్మాణం చేస్తున్నారని గ్రామస్తులు స్పందనలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా సబ్ కలెక్టర్ వచ్చి పరిశీలించి అక్రమ నిర్మాణాలు దొరకకుండా నిలిపివేయమన్నారు.వారి ఆదేశాలను ధిక్కరిస్తూ మళ్లీ అక్రమ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు గ్రామస్తులు తహసిల్దార్ మెహబూబ్ చాంద్ కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకెలితే గత ప్రభుత్వం ఇల్లు లేని లబ్ధిదారులకు ఇంటి స్థలాన్ని మంజూరు చేసింది.అయితే లబ్ధిదారులు కాకుండా ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఇండ్ల మధ్యలో దౌర్జన్యంగా మసీదులను నిర్మిస్తూ మత కలహాలను సృష్టించే విధంగా వ్యవహరిస్తున్నారని జగనన్న కాలనీ వాసులు ఎమ్మార్వోకి వివరించారు.

తాహసిల్దార్ మెహబూబ్ చాంద్ వివరణ

జగనన్న కాలనీలలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అలా నిర్మాణాలు చేపట్టి మతకలహాలు సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపర చర్యలు తీసుకుంటామని మహబూబ్ చాంద్ తెలిపారు.

పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందించండి

విశాలాంధ్ర- పెద్దతిప్ప సముద్రం: పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందించాలని సిడిపిఓ భాగ్యమ్మ అన్నారు. మండలం లోని కమ్మచెరువు అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యానికి రక్షణ మనకు నిత్యం అందుబాటులో ఉండే కూరగాయలు ఆకుకూరలు పండ్లు తీసుకోవాలని సూపర్ వైజర్ రామలక్ష్మమ్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-మొలకలచెరువు : ములకలచెరువు మండలం, పెద్దపాలెం గ్రామం వీరాంజనేయపురంలో కడప జిల్లా పులివెందులకు చెందిన చిన్నప్ప (32) రెండు వివాహాలు చేసుకున్నారు. అందులో మొదటి భార్య ఇక్కడ కాపురం ఉంటుండగా అతను అప్పుడప్పుడు భార్య వద్దకు వచ్చి వెళుతూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన మొదటి భార్య వద్దకు రాగా వారిద్దరి మధ్య కుటుంబ కలహాలతో పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు 108వాహనంలో చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అంగీకార్-2025 పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలోని మెప్మా కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాముడు అంగీకార్-2025 పోస్టర్‌ను పట్టణంలోని మెప్మా కార్యాలయంలో హౌసింగ్ , మెప్మా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగీకార్ అనేది ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఉద్దేశించిన కార్యక్రమమని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ హౌసింగ్ రామసూరెడ్డి, సిఎల్‌టిసి రామ చంద్రారెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ లు రామాంజనేయులు, మధు, వీరయ్య పాల్గొన్నారు.

పి-4 లబ్ధిదారుల స్థితిగతులపై సర్వే

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి చేపట్టిన పి-4 కార్యక్రమంపై స్థానిక పుర కమిషనర్ శేషఫణి సంబంధిత యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. పి-4 లబ్ధిదారుల స్థితిగతులపై పక్కాగా సర్వే నిర్వహించాలని సూచించారు. వారి తక్షణ అవసరాలపై గుర్తించి అందులో పొందుపరచాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో సదరు సిబ్బంది, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-పెద్దమండ్యం : మండలంలో తంబళ్లపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ దాసర పల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు పెద్దమండ్యం గ్రామం చెరువు క్రింద పల్లె రేషన్ షాప్ నెంబరు 29 షాపుల నందు స్మార్టుకార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు నారా గంగాధర్, రైతు విభాగ అధ్యక్షులు తుమ్మల మహేశ్వర, బూత్ కన్వీనర్ పవన్ కుమార్ యాదవ్, ఫారూఖ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అసెంబ్లీకైనా వెళ్లాలి.. లేదా రాజీనామానైనా చేయాలి : జగన్‌కు తులసి రెడ్డి సూచన

విశాలాంధ్ర-పులివెందుల: వైసిపి అధినేత జగన్ అసెంబ్లీ కైనా వెళ్లాలి లేదా ఎమ్మెల్యే పదవికి రాజీనామా నైనా చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి సూచించారు.బుధవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైకాపా పార్టీకి ప్రతిపక్ష పార్టీ హోదా ఇస్తేనే, తనకు ప్రతిపక్ష పార్టీ నాయకుని హోదా ఇస్తేనే ,అసెంబ్లీలో ఎక్కువసేపు మాట్లాడేటందుకు మైకు ఇస్తేనే నేను అసెంబ్లీకి పోతా లేకుంటే పోను అని పులివెందుల శాసనసభ్యుడు జగన్మోహన్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇది పసలేని వాదన అని, సమర్థనీయం కాదని, చిన్న పిల్లాడి చేష్టలని తులసి రెడ్డి అన్నారు. నియమావళి ప్రకారము , సాంప్రదాయాల ప్రకారం ప్రతిపక్ష పార్టీ హోదా రావాలి అంటే, ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ కు ప్రతిపక్ష నాయకుని హోదా రావాలి అంటే మొత్తం సభ్యుల సంఖ్యలో 10శాతం సభ్యులు ఆ పార్టీకి చెందిన

వారు ఉండాలన్నారు.కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడుగానే పి జనార్దన్ రెడ్డి అసెంబ్లీకి హాజరయ్యారని మిగతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారన్నారు. సమర్థవంతంగా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించారు.

డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డికి వినతి

విశాలాంధ్ర-పులివెందుల:ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన డ్రైవర్లకు సంబంధించినటువంటి హామీలను తప్పక అమలు చేయాలని "జయహో రథసారథి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్" కడప జిల్లా ఇన్చార్జి కంబటి హరిబాబు పేర్కొన్నారు. బుధవారం ఉదయం పులివెందులలో కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, వేముల మండల వైకాపా కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డిని కలిసి డ్రైవర్లకు ఉన్న పలు సమస్యలను వివరించారు. సంబంధిత అర్జీని ఇవ్వగా ఎంపీ అవినాష్ రెడ్డి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా తమ పార్టీ డ్రైవర్ల పక్షాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డ్రైవర్ల తరఫున ఈ నెల 22వ తేదీ అనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోని కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశామన్నారు. .

బాలగంగమ్మ నేత్రదానం

విశాలాంధ్ర-పులివెందుల: మండల పరిధిలోని ఎర్రబల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన బాల.గంగమ్మ (93 సంవత్సరాలు) బుధవారం నేత్రదానం చేశారు. ఆమె కుమారులు శ్రీరాములు,పెద్ద రామాంజనేయులు, చిన్న రామాంజనేయులు,కుమార్తె లు వెంకటలక్ష్మమ్మ, రామ లక్ష్మమ్మ, రామాంజనమ్మ, గంగాదేవి, గంగా భవాని లు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు కి సమాచారం ఇవ్వడం తో టెక్నీషియన్ అరవింద్ తో కలిసి గ్రామం లోని మృతురాలి నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి కడప లోని ఎల్ వి ప్రసాద్ నేత్రనిధి పంపినట్టు రాజు తెలిపారు. అనంతరం నేత్రదానం కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.మరణించిన వెంటనే 9966509364 కి సంప్రదించాలన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

విశాలాంధ్ర-పులివెందుల: రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రిన్సిపల్ డాక్టర్ మాధవ అన్నారు. స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన రక్త దాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ప్రభుత్వ సర్వజన వైద్యశాల రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 17 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కీర్తి రెడ్డి, శ్రీకాంత్, రాజేష్, సాయి శ్రీనివాస్, ప్రదీప్, సుబ్బారెడ్డి, కుమారి, మాధవి, సూపర్ ఇండెంట్ శివరామిరెడ్డి, పిడి డాక్టర్ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులు రోడ్లు మరమ్మత్తు చేపట్టాలి
సీపీఐ ములకలచెరువు కార్యదర్శి అంజన్నప్ప, నిజాంద్దీన్

విశాలాంధ్ర -ములకలచెరువు : మొలకలచెరువు మండలం 18 వ తారీఖున రాత్రి కురిసిన వర్షానికి చెరువులు కుంటలు రోడ్లు గండ్లబడి కోతలకు గురయ్యాయి. సీపీఐ ములకలచెరువు మండలం సమితి మండల కార్యదర్శి అంజన్నప్ప సహాయ కార్యదర్శి నిజాంద్దీన్ మాట్లాడుతూ గత కొంతకాలంగా నేటి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎన్నోసార్లు సమస్యలు అర్జీలు రూపకంగా తెలియజేసినాము అయినా ప్రయోజనం లేకుండా పోయింది కూటమి ప్రభుత్వం ఏర్పడి 12 నెలల కావస్తున్న చెరువులు కుంటలు మరమ్మత్తులకు నోచుకోలేదు. పకృతి అనుకూలించి రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు సానేవారిపల్లి దగ్గర కోతకు గురైఉన్నాయి జోకులు చెరువు నాయన చెరువు మేకల పాపన్న కుంట కొత్తచెరువు గండ్లు పడి తెగిపోయి ఉన్నాయి. నీటి సంఘాల ద్వారా ఎన్ని చెరువుల అభివృద్ధి చేశారు. కల్వపల్లి గ్రామం చౌడ సముద్రం గ్రామం సోంపల్లి గ్రామం ప్రజల విద్యార్థులు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు సోంపల్లి గ్రామంలో దిగుపాలెం గ్రామంలో రైతాంగం పండించిన పంటను మొలకలచెరువు మార్కెట్కు తీసుకురావడానికి ద్వార పండించిన మార్కెట్కు తీసుకురావ డానికి చాలా ఇబ్బందులను పడుతున్నారు. సహాయ కార్యదర్శి నిజాంద్దీన్ మాట్లాడుతూ చెరువు మరమ్మత్తులు చేపట్టలేని ప్రభుత్వం డబ్బులు ఇంజన్ సర్కారు సిగ్గుచేటని ప్రశ్నించారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చౌడప్ప మాట్లాడుతూ చెరువులు గాని కుంటలు గాని రోడ్లు గాని వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే ఉద్యమాలకు సిద్ధం అని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమములో సుబ్బన్న జయరాం శంకర మల్లికార్జున శంకరమ్మ తిమ్మన్న పాల్గొన్నారు.

శాంతియుత పోరాటం:అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: టిడిపి నాయకుల భౌతిక దాడులను తిప్పికొట్టేందుకు శాంతియుత మార్గంలో పోరాటం చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. చక్రాయపేట మండలం చిలేకాం పల్లె గ్రామంలో టిడిపి నేతల దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్త ఆదినారాయణరెడ్డిని బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడొద్దని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘన సత్కారం జరిగింది. ఒక్కో పాఠశాల నుండి ఒకరు చొప్పున ఉత్తమ ఉపాధ్యాయులను సదరు పాఠశాల యాజమాన్యం ఎంపిక చేసింది. స్థానిక కడప రోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రాంగణంలో (చర్చి స్కూల్) జరిగిన ఈ కార్యక్రమానికి ఆయా పాఠశాలల యజమానులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతా గబ్బు.. గబ్బు..!

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : స్థానిక పుర పాలిక పరిధి సున్నపుబట్టీల వీధిలోని పలు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచి పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై ఎక్కడ కక్కడ నీరు నిలిచింది. మురుగు కాలువలు లేని కారణంగా ఈ దుస్థితి నెలకొంది. రోజుల కొద్దీ వర్షపు నీరు నిల్వ ఉండడంతో బురదగా మారి పాచికట్టి ముక్కుపుటాలదిరేలా దుర్వాసన వస్తోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పురపాలిక అధికారులు స్పందించి అసౌకర్యాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కడప జిల్లా నూతన ఎస్పీని కలిసిన కుప్పాల

విశాలాంధ్ర-సిద్ధవటం : కడప జిల్లాకు నూతన ఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ఎస్పి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే శాలువాతో ఘనంగా సన్మానించారు.

పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-చెన్నూరు : దాతల సహకారంతో పేద కుటుంబాలకు సరుకులు పంపిణీ చేసినట్లు అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ విజయకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సీఐ రోషన్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రోషన్ మాట్లాడుతూ ఇలా పంపిణీ చేయడంలో ట్రస్ట్ కృషితో పాటు, దాతలు, కూడా భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. వీటి ద్వారా ఎంతోమంది బీద కుటుంబాలకు సహాయ సహకారం అందుతోంది.ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు అవసరమైన వస్తువులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తుందన్నారు. అలాగే ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి ట్రస్ట్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు ముదిరాజ్ రాము, సచివాలయం -3 ఏఎన్ఎం రోజా, విఆర్ఓ రమేష్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల డిఏ అరియర్స్ చెల్లించాలి :యస్‌టియు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2018 జూలై 2019 జనవరి నుండి చెల్లించవలసిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి దసరా కానుకగా ఆ కుటుంబాల్లో పండుగ ఆనందం నింపాలని కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్ర సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతాము ఎటువంటి ఇబ్బంది కలిగించమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక హామీలను విస్మరించడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నిరాశ,అసంతృప్తి నెలకొంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఏర్పడి సంవత్సర కాలం దాటిన సిపిఎస్ ఉద్యోగులకు ఇవ్వ వలసిన డిఎ అరియర్స్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం దారుణం. ఎందుకంటే నిత్యవసర ధరలు పెరగడం వల్ల జీవన ఖర్చులు అదుపులో లేక ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కావున ప్రభుత్వం వెంటనే స్పందించి సిపిఎస్ ఉద్యోగులకు అరియర్స్‌ను చెల్లించాలన్నారు. నాలుగు విడతలుగా ఇవ్వవలసిన డిఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కొక్క ఉద్యోగికి సగటున దాదాపుగా రూ.50వేల అరియర్స్ రావాలి. వెంటనే చెల్లించాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మేము 57 ప్రకారం రాష్ట్రంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలుపరిచి మిగిలినటువంటి ఉద్యోగులకు సిపిఎస్,జిపిఎస్,యుపిఎస్,పిఎఫ్ ఆర్‌డిఏ పథకాలన్నీ ఉద్యోగులను తప్పుదారి పట్టించే పథకాలు వీటితో భరోసా దక్కదని వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దసరా సెలవుల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : వృత్తి విద్యలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు దసరా సెలవల్లో ఇంటర్నల్ షిప్‌లో ట్రైనింగ్ నిర్వహిస్తున్నారని వృత్తి విద్య బోధకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్ నర్సాపురంలోని విద్యార్థిని విద్యార్థులకు పోరుమామిళ్ల పట్టణంలోని గ్రామ సచివాలయం- 1, 2 సచివాలయం నితీష్ ఇంటర్నెట్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ గ్లోబల్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ సీఎస్‌సీ ఈ సేవ కేంద్రం సంగీత డిజిటల్ నందు మొత్తం 48 విద్యార్థులు ట్రైనింగ్ పొందుతున్నట్లు అధ్యాపకుడు శ్రీనివాస్ తెలిపారు. వీరికి పదిమంది ట్రైలర్స్ శిక్షణ ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు పలు విషయాలు తెలుసుకొని సచివాలయంలో జరిగే సేవలపై అవగాహన పొందుతారని భవిష్యత్తులో ఈ ట్రైనింగ్ వారి వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ట్రైమింగ్ సెంటర్లో ట్రైనర్స్ సురేష్, మల్లి, నికిత కుమారి, వసుధ, మౌలాలి, బాబు, రఘుతో పాటు ట్రైనింగ్ చేస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు

డీఎస్సీ అభ్యర్థులు 43 ప్రత్యేక బస్సుల్లో అమరావతికి పయనం

820 మంది ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 1666 మంది

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లా నుండి ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులు మొత్తం 869 కాగా అందులో 820 మంది వారి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం 1666 మంది, 122 స్టాఫ్,15 మంది పోలీసుల భద్రతతో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం నుంచి ఉదయం 9:40 గంటలకు 43 ఆర్టీసీ బస్సుల్లో అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ప్రారంభించారు 25-9-2025 గురువారం మధ్యాహ్నం 2-30 గంటలకు అమరావతి సెక్రటేరియట్

ప్రాంగణం నందు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ల చేతులు మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు.డీఎస్సీ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, డీఎస్సీ వైస్ చైర్మన్ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్,డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడులు ఎంపిక ప్రక్రియకు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన 869 మంది అభ్యర్థుల్లో 637 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు ఉండగా,మిగిలినవారు టీజీటీలు పీజీటీలు ఉన్నారు.

తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన :ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు

విశాలాంధ్ర-చెన్నూరు : గ్రామంలోని పొడి చెత్తపై అవగాహన కల్పించాలని, చెన్నూరును పరిశుభ్రమైన మోడల్ గ్రామపంచాయతీగా దిద్దుదామని ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం పంచాయతీ పరిశుభ్రతపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబర్ రెండవ తేదీ నాటికి చెన్నూరును పరిశుభ్రమైన పంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు. డ్వాక్రా సంఘాలు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో కలసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎక్కడ చెత్తను వేయకుండా, మురికి నీరు రోడ్లమీదకు వదలకుండా చూడాలన్నారు.తయారు చేద్దాం అని, అదేవిధంగా ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు అందజేయాలని తెలిపారు. అలాగే వచ్చిన ప్రతి ఒక్కరికి అవగాహన వచ్చే విధంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, కార్యదర్శి శివశంకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కుంకుమ అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-రామసముద్రం : నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని పలు అమ్మవారి ఆలయాలలో అమ్మవారు బుధవారం కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు మండలంలోని మాలేనత్తం పంచాయతీ మూగ ఎర్రపల్లె గ్రామంలో వెలసిన పటాలమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు శివ కుమార్ దీక్షితులు ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు అభిషేకాలు అర్చనలు చేశారు గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి తమ మొక్కులు తీర్చుకున్నారు ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బద్వేల్ లోక కళ్యాణ మేళా పి.యం. స్వానిధి 2.0 కార్యక్రమం

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద గల గాంధీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద లోక కళ్యాణ మేళ పి.ఎం. స్వానిధి 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి కడప జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్ బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ బద్వేల్ మునిసిపల్ కమీషనర్ నరసింహ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధి విక్రయదారులు,చిన్న వ్యాపారస్తుల అభివృద్ధి కోసం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ పథకం వీధి వ్యాపారుల సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తుందన్నారు. పీఎం స్వానిధి 2.0గా మార్చి మొదటిసారి లోన్ రూ.15,000, రెండవసారి 25,000 మూడవసారి రూ.50వేలు వీధి విక్రయదారులకు, చిరు వ్యాపారులకు అందించనున్నట్లు చిరు వ్యాపారుల కోసం పేటీఎం స్కానర్ సౌకర్యాన్ని కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి స్ట్రీట్ వెండింగ్ కమిటీ మెంబర్‌లు పట్టణంలోని బ్యాంకర్లు, సీఎంఎం, సిఓలు, ఆర్పీలు, మహిళలు,వీధి వ్యాపారులు,చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల చైతన్యంతోనే దేశ సమగ్రాభివృద్ధి :వైవీయూ జర్నలిజం అధ్యాపకులు సురేష్ బాబు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జనాభాలో సగభాగంలో ఉన్న మహిళలు పూర్తిగా చైతన్యవంతులై దేశాభివృద్ధిలో భాగస్వాములు అయినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని యోగివేమన విశ్వవిద్యాలయ జర్నలిజంశాఖ అధ్యాపకులు డా.తుమ్మలూరు సురేశ్ బాబు అన్నారు. వేంపల్లె లోని వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉష పథకంలో భాగంగా (జెండ ఇంక్లూజివ్నెస్ అండ్ ఈక్విటీ ఇన్సియేటటివ్) కోసం "సమాచార హక్కు చట్టంపై వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రముఖ జర్నలిస్ట్ యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజం అన్ని రంగాల సమగ్ర అభివృద్ధికి మహిళలు ప్రభుత్వంలో భాగస్వాములు కావలసిన అవసరాన్ని గురించి వివరించారు. కళాశాల పిఎం ఉష పథకం కోఆర్డినేటర్ డాక్టర్ కొండా సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ పథకం కింద ఎన్నికైన కళాశాలలు ఐదు కాగా,

రాయలసీమ ప్రాంతంలో మా కళాశాల కావడం గమనార్హమన్నారు. ఈ కార్యక్రమ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పట్ల మహిళా విద్యార్థులలో అవగాహన రావడానికి ఈ వర్క్ షాప్ ఎంతో దోహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బండి రామకృష్ణ,ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ డాక్టర్ నాగలక్ష్మి దేవి,రెడ్రిబ్బన్ క్లబ్ కన్వీనర్ ఈ సుధాకర్, గ్రంథాలయ శాఖ అధిపతి డాక్టర్ పి మాధవరావు, కంప్యూటర్ శాఖాధిపతి డాక్టర్ ఎన్ కిరణ్మయి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, వాణిజ్య శాఖ అధ్యాపకులు సి.వినోద్,ఫిజికల్ డైరెక్టర్ రాచివేటి తేజేంద్ర, గణిత శాస్త్ర అధ్యాపకులు రాజారెడ్డి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ప్రసాద్, అధ్యాపకురాల కేశమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-గాలి వీడు : వడిశలంక పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వై. రమణయ్య (51) తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికుల కథనం మేరకు సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట మండలం గూటిబయలు గ్రామానికి చెందిన రమణయ్య, నరసింహులు కలసి ద్విచక్ర వాహనంపై పెళ్ళి పత్రికలను పంచుతూ గాలివీడు మీదుగా రాయచోటికి ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో వడిశలంక పల్లి వద్ద అదుపు తప్పి క్రింద పడటంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రమణయ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించినట్లు సమాచారం.

పి 4 కార్యక్రమంపై శిక్షణ

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని స్థానిక మండల పరిషత్ సమావేశంలో పి 4 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తాసిల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జాషువాలు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండలంలో పి 4 కింద మండలంలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను ఆయా సచివాల పరిధిలో ఒక్కొక్క సచివాలయానికి 25 కుటుంబాలు చొప్పున కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ నాగార్జున ,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారిశాల నూతన అధ్యక్షునిగా సురేష్ బాబు ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంనికి నూతన అయ్యపు వెంకట సురేష్ బాబు ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేపట్టారు. ప్రమాణస్వీకారం మహోత్సవ మాజీ అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి, అవాపాకమిటీ యువజన కమిటీ మహిళ కమిటీలతో సభ్యులతో కార్యదర్శి, సుంకు సురేష్, అమ్మవారి శాల కోశాధికారి దుగ్గిశెట్టి, వెంకటేశ్వర్లు, యువజన కమిటీ అధ్యక్షులు యాదాల వెంకటసుబ్బయ్య తో కలిపి ప్రమాణ స్వీకారం చేపట్టారు అదేవిధంగా అమ్మవారి శాలలో జరుగుతున్న శరన్నవ రాత్రుల మహోత్సవము శ్రీ వాసవి కన్యక అమ్మవారి శాలలో అంగరంగ వైభవంగా ఆర్యవైశ్య సంఘం, నూతన కమిటీ సభ్యులతో కలిసి శరన్న రాత్రుల మహోత్సవము అంగరంగ వైభవంగా నిర్ణయించడం జరుగుతుంది. అందులో భాగంగానే ఉదయం తెల్లవారుజాము నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు కార్యక్రమాలతో పాటు శ్రీ భవాని దేవి అలంకారణలో అమ్మవారి ప్రత్యేక దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఉభయ దాతలు దుగ్గిశెట్టి వెంకటసుబ్బయ్య ఆయన ధర్మపత్ని అరుణకుమారి సన్స్ దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు ఆయన ధర్మపత్ని లక్ష్మి మానస సన్స్ దుగ్గిశెట్టి గురవయ్య ధర్మపత్ని సత్యనారాయణమ్మ వారి సన్స్ భవనాన్ని కిషోర్ వారి ధర్మపత్తిని శివకుమారి వారి సన్స్ మాకం గురవయ్య వారి ధర్మపత్తిని సరస్వతి వారి బ్రదర్స్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి వివిధ రకాల అలంకరణ పూలతో అమ్మవారికి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి శాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమింప చేసిన దేవగుడి..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో టిఎన్‌టియుసి, బిఎంఎస్ సంఘాలు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్న విషయం విధితమే. శాసన మండలి మాజీ సభ్యులు దేవగుడి నారా యణ రెడ్డి కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు, కీలక సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర-పెద్దమండ్యం : మండలంలో కలిచర్ల జూనియర్ కాలేజీలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే, ఫ్రెషర్స్ డే కార్యక్రమం ప్రిన్సిపాల్ అమరేంద్ర, ఎన్ఎస్ఎస్ పిఓ ఎస్.వెంకట నరసయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్. అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్. వెంకట నరసయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24 తేదీన ఎన్ఎస్ఎస్ డే జరుపుకుంటారన్నారు. ప్రతి విద్యార్థి వాలంటీరుగా సేవ దృక్పథం కలిగి ఉండాలని తద్వారా సమాజం పట్ల సేవ భావం కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం లక్షణాలు పెంపొందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో యస్. వెంకట నరసయ్యతో పాటు రవీంద్ర, వినాయకరెడ్డి, దావీదు, చిన్న, అంజి, ఆలియా, అనిత, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి - సీపీఐ

విశాలాంధ్ర-గాలివీడు : మండలంలో ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కబ్జా చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ ను కలసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలివీడు టౌన్ పరిధి సర్వే నంబర్ 475 లో 80 సెంట్లు ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని ఆరోపించారు. వెంటనే ఆక్ర మణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆ భూమిని నిరుపేదలకు పంచి పెట్టాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ (ఎం ఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఎం.రఘునాథ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బర్రెలకు వ్యాక్సిన్ పంపిణీ :జిలాని భాష

విశాలాంధ్ర-సిద్ధవటం : పాడి పశువుల రైతుల బర్రెల బాగా అపరిశుభ్రత లేకుండా రైతులు జాగ్రత్త వహించాలని వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ జిలాని భాష తెలిపారు. మండలంలోని గొల్లపల్లి, జ్యోతి గ్రామాలలో బర్రెలకు గాలికుంటు నివారణ కొరకై బుధవారంపాడి రైతుల బర్రెలకు వ్యాక్సిన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైవ్ స్టాక్అసిస్టెంట్ జిలాని భాష మాట్లాడుతూ మాచుపల్లి వెటర్నరీ పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ విజయరాజు ఆధ్వర్యంలో పాటి రైతుల బర్రెల గాలికుంటునివారణ కొరకై వ్యాక్సిన్ పంపిణీ చేశామని వర్షాకాలంలో పాడి రైతుల పశువుల జాగా శుభ్రంగా పెట్టుకోవాలని అపరిశుభ్రత ఉంటే గేదెలకు గిట్టల వ్యాధి సోకే ప్రమాదం ఉందని నివారణ కొరకై వ్యాక్సిన్ పంపిణీ చేసి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు అందించామన్నారు.

అన్నపూర్ణా దేవిగా ఇరుగులమ్మ తల్లి

విశాలాంధ్ర-గాలివీడు : గోపనపల్లె పూజారివాండ్లపల్లెలో వెలసిన ఇరుగులమ్మ తల్లి ఆలయంలో మూడో రోజు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. శరన్న వారిత్రుల్లో భాగంగా అమ్మవారి అవతారాల్లో అన్నపూర్ణాదేవి రూపం విశిష్టమైనది. ఈసందర్భంగా వేదపండితులు నాగఫణి కిషోర్ శర్మ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే అన్నపూర్ణ దేవిని దర్శించుకుంటే ఆకలి దప్పులుండవని, ప్రాణకోటికి జీవనాధారం అన్నం కాబట్టి అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తమన్నారు. సాక్షాత్తు పరమేశ్వరుడికే భిక్షపెట్టిన అన్నపూర్ణాదేవిని ధ్యానిస్తే ధనధాన్యవృద్ధి, ఐశ్వర్య సిద్ధి కలుగుతుందన్నారు. లోకంలో జీవుల ఆకలిని తీర్చటం కన్నా మించినది ఇంకేమీ లేదన్నదే ఈ అలంకారం వెనుకున్న ఆంతర్యం అని స్పష్టం చేశారు.

అరుదైన తాళపత్రాలు లభ్యం : మూల మల్లికార్జున రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగుసాహిత్యం లోకంలో ప్రచురించని అరుదైన తాళపత్ర గ్రంథాలు వైయస్సార్ కడప జిల్లా, కడపలోలభించినట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలియజేశారు. బుధవారం జిల్లా పరిషత్ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పెండ్లిమర్రి మల్లయ్య పిలుపు మేరకు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ప్రసిద్ధ కవి, వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మృత్యుంజయ కుంట శివాలయం పక్క వీధిలో ఉన్న మల్లయ్య స్వగృహం వెళ్లి ఆయన పూర్వీకుల నుండి వస్తున్న నాలుగు తాళపత్ర గ్రంథాలను పరిశీలించి స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఈ తాళపత్ర గ్రంథాలు చాలా ప్రాచీనమైనవని, ఇవి పూర్తిగా ఆధ్యాత్మికమైన జ్ఞాన గ్రంథాలని. ఈ తాళపత్ర గ్రంథాలను ఎవరు రాశారో, ఎప్పుడు రాశారో తెలియదని, ఆయా కవుల పేర్లు ప్రస్తావిం చలేదని, ఈ నాలుగు తాళ పత్రాల్లో ఆధ్యాత్మిక జ్ఞాన రహస్యాలు ఎన్నో ఉన్నాయన్నారు. వెల్లాల వెంకటేశ్వరాచారి ఎన్నో సంవత్సరాలుగా తమ పూర్వీకుల నుండి సంక్రమించిన ఈ తాళపత్రాలను ఇంతవరకు కాపాడుతూ వస్తున్న మల్లయ్యను అభినందిం చారు. ఆ తాళపత్రాలు ఇంతవరకు ప్రచురణ కాకపోతే వాళ్లు ప్రచురిస్తే చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలోపెండ్లిమర్రి మల్లయ్య ప్రముఖ రంగస్థల నటు లు పట్నం సుబ్బరాయుడు, మల్లయ్య సతీమణి శివపార్వతి పాల్గొన్నారు.

రైతులకు వరం కిసాన్ ధన్ ఆరోగ్య యోజన

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : రైతులు కిసాన్ ధన్ ఆరోగ్య యోజన భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పివిఆర్ గ్రూప్స్ ఆర్గనైజషన్స్ ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి మండలం పర్వతరెడ్డి గారిపల్లి, అప్ప కొండయ్యగారి పల్లి, గంగనపల్లిలలో రైతులకు అవగాహన కల్పించారు. కిసాన్ ధన ఆరోగ్య యోజన ప్రయోజన పథకం రైతుల కోసం ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకం. ఈ పథకం ద్వారా రైతులు సభ్యత్వం తీసుకోవడం వల్ల రైతుల సహాయం కోసం రైతులకు రూ.25,000 వేలు వరకు. రైతులకు పట్ట నష్టపరిహారం రూ.50,000ల వరకు రైతు ఏదైనా ప్రమాదం జరిగితే 3 లక్షల వరకు ప్రమాద మరణంతో పాటు పీటీడీ, పీపీడీ కవర్ చేయబడతాయన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాల కోసం మీ మండల కోఆర్డినేటర్‌ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కో ఆర్డినేటర్ కె.మల్లికార్జున, కడప అన్నమయ్య జిల్లాల అవేర్నెస్ మేనేజర్ సంపత్, రాయలసీమ అవేర్నెస్ మేనేజర్ మణికంత, మేనేజర్ సాయి ఇంకా సంస్థ ప్రతినిధులు రమాదేవి, హరికృష్ణ, తేజ, మండల కోఆర్డినేటర్లు పి.తేజ, రహమత్ జాన్, శివ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిపై రాముల వారి కరుణ కటాక్షాలు ఉండాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రతి ఒక్కరిపై శ్రీరాముల వారి కరుణ కటాక్షాలు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి ఆకాంక్షించారు. బుధవారం కడప నగరం 42వ డివిజన్ రవీంద్రనగర్‌లోని రామాలయ ఆర్చి నిర్మాణ పనులను శ్రీనివాసులు ప్రారంభించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు, స్థానిక టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆర్చి నిర్మాణంతో ఆలయానికి మరింత శోభ చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రాజశేఖర్, కార్పొరేటర్ చల్లా స్వప్న, నగర అధ్యక్షులు మన్సూర్ అహ్మద్, శంకర్‌రెడ్డి, బండి ప్రభాకర్, అఫ్జల్, రెడ్డయ్య యాదవ్, శిలాస్, ఆలయ నిర్వాహకులతోపాటు పెద్ద ఎత్తున స్థానిక భక్తులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవి అలంకరణలో శ్రీ కన్యకా పరమేశ్వరి

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రంలోని వైశ్యాబజార్‌లో దసరా ఉత్సవాలలో భాగంగా దేవి శరన్నవరాత్రి అలంకారణ ఉత్సవాలలో అలంకరణలో ముడవరోజు అన్నపూర్ణాదేవిగా కన్యకా పరమేశ్వరి అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు.శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు వివిధ అలంకారములలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఘనంగా మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డు ప్రధానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో వై.వి నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్(కడప) ఆర్థిక(లక్షరూపాయల పైన) సహకారంతో మెరిట్ స్కాలర్ షిప్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరు విభాగాల(మెకానికల్, ఈఈఈ, సీఎస్ఈ, ఈసీఈ) విద్యార్థులలో 2వ సంవత్సరం చదువుతున్న వారిలో, మొదటి సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన వారు, 3వ సంవత్సరం చదువుతున్న వారిలో, గత 2సంవత్సరాలుగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయ్యారు. పూర్వ విద్యార్థుల కమిటీ కోఆర్డినేటర్, ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.వి.గురుమూర్తి రెడ్డి చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభను సాధించడానికి కృషి చేస్తే సమాజంలోని దాతలు ముందుకు వచ్చి ప్రోత్సాహం అందించడం ఎంతో అభినందనీయం అని ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ట్రస్ట్ చైర్మెన్ వై.వినయ్‌కుమార్ మాట్లాడుతూ నా తండ్రి వై.వి నాయుడు ఈ కళాశాలలో ప్రిన్సిపల్‌గా సేవలందించారని, ఆయన స్మారకార్థంగా మా కుటుంబం ఈ ట్రస్టను ఏర్పాటుచేసి ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయడం మాకు గౌరవంగా, ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డా.గురుమూర్తి రెడ్డిని ట్రస్ట్ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగ సన్మానించారు.

విద్యార్థులు భక్తి సేవా దృక్పథాలను అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-పీలేరు: విద్యార్థులు విద్యుత్‌తో పాటు దేశం పట్ల గౌరవం భక్తి సేవా దృక్పథాలను అలవర్చుకోవడం వలన మన దేశం ప్రగతి పథంలో నడిపించవచ్చునని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి అన్నారు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఎన్ఎస్ ఎస్ డే ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్ర మంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సహదేవ కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే జాతీయ సేవాపథక దినోత్సవంను ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులలో సేవా భావంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిం చడమే జాతీయ సేవా పథకం ముఖ్య లక్ష్యం అని ప్రిన్సిపాల్ వేంపల్లి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని కళాశాల పరిసర ప్రాంతాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల సహదేవరెడ్డి, సుందరావు, శాంతయ్య, కళ్యాణి, అనూష, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైనాన్షియర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్:ఎస్పీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఫైనాన్షియర్ వేణుగోపాల్ రెడ్డి హత్యకేసులో 6మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 19వ తేది స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదైందని తెలిపారు. 21వ తేది 2గంటలకు కుందూ నదిలో గుర్తు తెలియని శవం కనిపించడంతో అది మిస్ అయిన వేణుగోపాల్ రెడ్డిదే అని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కేసు విశయంలో 5ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వేణుగోపాల్ రెడ్డి హత్యకేసులో వెన్నపూస లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి వీరిద్దరిది ప్రొద్దుటూరు కాగా బోయన నాగేష్ అలియాస్ వర్మ, అజయ్‌కుమార్, చింతలచెరువు ప్రణయ్‌కుమార్, కొత్త శివప్రసాద్ హైదారాబాద్‌కు చెందిన వారు అని వారందరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ పుతి భావన, రూరల్ సీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని నందిపల్లె దొడ్ల డైరీ సమీపంలో మంగళవారం రాత్రి జాతీయ రహదారి పై ప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయాలు గ్రామస్తులు సహాయంతో బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తరలింపు అక్కడి నుండి కడప రిమ్స్ కు తరలించినట్లుగా సమాచారం. వివరాలు పల్నాడు జిల్లా మాచర్ల మండలం విజయపురి గ్రామానికి చెందిన గడ్డిపర్తి యాకోబు (60)ను గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన యాకోబు నందిపల్లె దొడ్ల డైరీకి పాలు తీసుకువచ్చిన లారీకి క్లీనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. భోజనం కోసం నందిపల్లె సెంటర్‌కి వెళ్లి తిరిగి డైరీ వద్దకు వస్తుండగా ఈ ప్రమాదం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్లు సమాచారం లారీ డ్రైవర్ కలేశావలి వివరించారు. జాతీయ రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటోంది అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం చేస్తాం: ఎంపీ అవినాష్ రెడ్డి

విశాలాంధ్ర - పులివెందుల : ఏ సమస్య వచ్చినానాయకులకు ప్రజలకు కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులకు ప్రజలకు కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. బుధవారం ఆయన పార్టీ ఆఫీసులో ప్రజలతో మాట్లాడుతూ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి ఎంపీ అవినాష్ రెడ్డిచక్రాయపేట మండలం చిలేకంపల్లి గ్రామం లో కూటమి నాయకుల దాడిలో గాయపడిన ఆదినారాయణ రెడ్డి ని పరామర్శించేందుకు వెళ్లారు.

మహిళలు ఉద్యోగ నైపుణ్యాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నేడు పేరెన్నిక కలిగిన కంపెనీల్లో మహిళ లకు మంచి ఉద్యోగ అవకా శాలు ఉన్నాయని,మహిళలు అందుకు తగినట్లుగా ఉద్యోగ నైపుణ్యాలు నేర్చుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కందుల గ్రూప్ కళాశాలల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే.చంద్ర ఓబుల్ రెడ్డి కోరారు. బుధవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం నందు. కె.ఎల్.ఎమ్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఏర్పాటు చేసిన స్వాగతోత్సవంలో ముఖ్య అతిథిగా విచ్చేసి వారు మాట్లాడారు. తమ పిల్లలను ఉద్యోగాలు చేసే విధంగా తల్లితండ్రులు ప్రోత్సహించాలని కోరారు. మహిళలు తమ కాళ్లపై నిలబడే విధంగా తల్లితండ్రులు సహాయం చెయ్యాలని కోరారు. నేడు మహిళలకు విస్తృత అవకాశాలు అందిపుచ సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో అన్నీ శాఖల విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది ,విద్యార్థినులు పాల్గొన్నారు.

హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలనపై

రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్

విశాలాంధ్ర -ప్రొద్దు టూరు: ఆంధ్రప్రదేశ్ హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలణ మరియు నియంత్రణ మండలి, కడప జిల్లా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ మండలి ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "ఐఈసీ హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలణపై అవగాహన కార్యక్రమం" నారాయణ జూనియర్ కళాశాల నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాఘవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్‌లు వాసుదేవరెడ్డి, ప్రతాప్ మరియు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు,ఎస్ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ పి.నరేష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారం, అలవాట్లు, రక్తదానం, సోషల్ మీడియా మోసాల గురించి తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వం అందించే సేవలను వాటి ప్రాధాన్యత గురించి తెలిపారు.

ప్రహరి గోడ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం : మండల పరిధిలో నరసన్నపల్లె గ్రామంలో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి స్వయంభియోగ వేదపాఠశాల

ప్రహరి గోడ నిర్మాణం కొరకు దేవాదాయ శాఖ నిధులతో 25 లక్షలు రూపాయలు మంజూరు చేయించిన మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్.ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేం ద్రస్వామి స్వయం భియోగ వేదపాఠశాల నిర్వాహకులు చంద్రస్వామి హైదారాబాదులో ఉన్న ఎమ్మెల్యే నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో స్థానిక నరసన్న పల్లె గ్రామాని చెందినటిడిపి నాయకులు బలగాని నారాయణ యాదవ్,నాగిపోవు గంగయ్య,నాగిపోగు లక్ష్మణ్ పాల్గొన్నారు.

దొడ్డిపల్లిలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-పీలేరు: మండలం దొడ్డిపల్లి గ్రామంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గొల్ల కిషోర్ నాయుడు, జనసేన పార్టీ పీలేరు మండల అధ్యక్షుడు మోహన్ కృష్ణ ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు గురు మోహన్, కార్యదర్శి రాజేష్, పార్టీ నాయకులు సుబ్బు, బాలు, గణేష్, నాగరాజా, తేజ, అలాగే కూటమి నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

డీఏడబ్ల్యూ కళాశాలపై

కోర్టులో పిల్ ఎందుకు వేయలేదు

డాక్టర్ జీ.వి ప్రవీణ్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరు ప్రజలకు వాస్తవాలు వివరించకుండా పక్కదోవ పట్టిస్తున్నారని తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ డాక్టర్ జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పత్రికా ప్రకటనలో మహర్షి స్కూల్ స్థలాన్ని ఎవరూ కొనకడని, ఆ స్థలానికి నాకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొనడంలో ఆంతర్యం ఏమిటని అన్నారు. తాను మహర్షి స్కూల్ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు మాటమార్చి మహర్షి స్కూల్ స్థలం విశయంలో కోర్టులో పిల్ వేశానని మాట్లాడటం వింతగా ఉందన్నారు. మహర్షి స్కూల్ స్థలం విశయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రాచమల్లు ధర్నా చేస్తే ఆ స్థలంలో 35సెంట్ల స్థలాన్ని రాచమల్లు అన్న కిరణ్‌కుమార్ రెడ్డికి రాయించుకోలేదా అని ప్రశ్నించారు. అలాగే డీఏడబ్ల్యూ కళాశాల స్థలం అధికారంలో ఉండగా అడ్డుకోవాల్సిన రాచమల్లు రెండున్నర కోట్ల రూపాయలు తీసుకొని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించలేదా అని ప్రశ్నించారు. అలాగే డీఏడబ్ల్యూ కళాశాలలో 14శాతం వాటాను తన అన్న పేరు మీద తీసుకున్నారని గుర్తు చేశారు. దొంగలు..దొంగలు ఊర్లు పంచుకున్న చందాన ప్రొద్దుటూరులో స్థలాల కబ్జా చేయడంలో ముందంజలో ఉన్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తన నిజాయితీని నిరూపించు కోవాలంటే మహర్షి స్కూల్ స్థలంపై కోర్టులో దావా వేసినట్లుగా డీఏడబ్ల్యూ కళాశాల స్థలంపై కూడ కోర్టులో పిల్ వేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని స్థానిక ఈశ్వర్‌రెడ్డి నగర్‌లోని అమ్మ నాన్న మదర్‌థెరిస్సా షట్టర్ వృద్ధాశ్రమం నందు పి.సుగమంచి పల్లె వాసులు ఒంటెద్దు రామసుబ్బారెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం మరియు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌డీఎస్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు సపర్యలు చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు హిదాయత్, మేనేజర్ రామారావ్ ఎంతో అభినందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు సుదర్శన్ రెడ్డి, స్వప్న, చెన్నమ్మ, రఫి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష శ్రీనివాస్‌నగర్‌లో వినియోగదారుల వద్దకు వెళ్లి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం విడుదల చేసిందని, రేషన్ షాపుల వద్ద ప్రజలు పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని అయితే దీనిని అధిగమించడానికి అలాగే పారదర్శకంగా వ్యవహరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 1.46కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని, వీటిలో క్యూఆర్ కోడ్ ఉంటుందని, ఇది రేషన్ పంపిణీలో పారదర్శకతను పెంచుతుందన్నారు.

సమతుల ఆహారం సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సిడిపిఓ జహరాబీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సుపోషిత్ భారత్ సంక్షం భారత్ కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లి సెంటర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ జహరబి మాట్లాడుతూ సుపోషిత్ భారత్ సక్షం భారత్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగనవాడీ కార్యకర్తలను సూచించారు.

ప్రభుత్వం మార్గదర్శక పాత్ర పోషిస్తుంది

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: ప్రభుత్వం మార్గదర్శక కీలక పాత్ర పోషిస్తుందని మండల స్పెషలాఫీసర్ నరసింహమూర్తి, ఎంపిడిఓ ఆర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయంపైన సమావేశ హాలులో జరిగిన బంగారు కుటుంబాల పురోగతిపై జరిగిన సెక్రెటరీల సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. శిక్షణకులు దొరబాబు, గంగయ్య మాట్లాడుతూ పి4 లక్ష్యం ఉన్న కుటుంబాలను అవసరమున్న వారితో కలిపి ప్రోత్సాహించాలన్నారు. బంగారు కుటుంబాలు మార్గదర్శకులు గ్రౌండ్ లెవల్ లో సచివాలయ సిబ్బంది పగడ్బందీగా సర్వే చేసి వారి అడ్రస్ ప్రకారం డేటా సేకరించి యాప్ లోడ్ చేయాలన్నారు. సెక్రటరీ మహేష్, మండలంలోని గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అధ్యక్షతన ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వద్ది సురేశ్, వైస్‌చైర్మన్‌గా పట్నం లక్ష్మణ్‌కుమార్ మరియు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ వద్ది సురేశ్, వైస్ చైర్మెన్ పట్నం లక్ష్మణ్ కుమార్ మరియు డైరెక్టర్లకు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి (వాసు) శుభాకాంక్షలు తెలిపారు. ప్రొద్దుటూరు మార్కెట్ కమిటీకి పూర్వ వైభవం తెస్తానని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్ నాయుడుతో పాటు పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలిని తాకిన విగ్రహాల సెగ

విశాలాంధ్ర-పులివెందుల: విగ్రహాల సెగ శాసనమండలని తాకింది. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. అనధికార విగ్రహాలను తొలగించాలని శాసనమండలి సభ్యులు రామగోపాల్ రెడ్డి బుధవారం మండలిలో స్పీకర్ కు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2524 విగ్రహాలు అనధికారికంగా ఉన్నట్లు మంత్రి స్వయంగా చెప్పారన్నారు. గతంలో అనధికార విగ్రహాలను తొలగించాలంటూ భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినా ఆ మేరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. అనధికారికంగానే కడప పులివెందులలో కోట్లాది రూపాయలు ఖర్చు చేశారన్నారు. 2009లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం 2014లో అనధికారికంగా విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. పులివెందులలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం పెట్టేందుకు అధికారులు అనుమతులు ఇవ్వలేదని ఆ విగ్రహాలకు ఉన్న అభ్యంతరం వైఎస్ఆర్ విగ్రహాలు పెట్టేందుకు అనుమతి అధికారులు ఎలా ఇచ్చి ఉంటారని ఆయన స్పీకర్ ను అడిగారు. కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యుంటే ఎవరు బాధ్యులని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను అని అన్నారు.

స్వస్థ్ నారి స్వసక్తి పరివార్ అభియాన్

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం పార్నపల్లె ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో బుధవారం స్వస్థ నారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు బి పి, ఆర్బి, హెచ్‌బి టెస్టింగ్, వ్యాధి నిరోధక టీకాలు అందించటం, 18 సం నుండి 60 సం వయస్సు వారికి ప్రధాన మంత్రి జనఆరోగ్య యోజన కార్డ్ జనరేట్ చేయటం మరియు ప్రధానమంత్రి జన ఆరోగ్య వెయ్ వందన 70 సం పైబడిన వారికి ఈకేవైసీ చేయటం, మందులు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో వైద్య సిబ్బంది, సూపర్వైజర్ స్టాఫ్, 104 సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మున్సిపల్ కమీషనర్ వర్కర్స్ పట్ల అనుసరిస్తున్న టువంటి అనుచితమైనటువంటి వైఖరికి వ్యతిరేకంగా బుధవారం నాడు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వర్కర్స్ ఏదైనా సమస్య గురించి కమిషనర్‌ను కలవడానికి వెళ్తే వారి పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విభాగం అధ్యక్షుడు బి.రామయ్య తెలిపారు. అధికారులను సంప్రదించేటువంటి హక్కు వర్కర్స్‌కు ఉందని, దాన్ని కాదనడానికి ఎవరికి వీలు లేదని అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న అకౌంట్లకు యాక్సిస్ బ్యాంకుకు మార్చాలని మున్సిపల్ అధికారులు ఆదేశం ఇవ్వడంతో అది ఇష్టం లేనటువంటి కార్మికులు ఈ విషయం తెలియజేసేందుకు రాత పూర్వకంగా ఆర్జీ రాసి కమీషనర్‌కు అందజేయడానికి వెళితే ఆయన వ్యవహరించిన తీరు సరిగా అవదని తెలిపారు. ఇప్పటికైన ఆయన తీరు మార్చుకోవాలసి లేని పక్షంలో పై అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మధు, నాయకులు చైతన్య, డివిజన్ నాయకులు నాగరాజు, నిర్మల, గురుమూర్తి, శ్యామ్, రాజేష్, వీరమ్మ, ప్రమీల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం దేశ వ్యాప్త ఉద్యమం

బాస్ నేషనల్ కో ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు

విశాలాంధ్ర-మదనపల్లె: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం, దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు భారతీయ అంబేద్కర్ సేన (బాస్) నేషనల్ కో ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు స్పష్టం చేశారు. పూనా ఒప్పంద దుర్దినాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్య టవర్స్ లోని ఫంక్షన్ హాల్ నందు విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ), భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో "రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు" అన్న అంశంపై అవగాహన సదస్సు జరిగింది. బాస్ కేంద్ర కమిటీ సభ్యుడు కె.వి.రమణ, బాస్ మరియు వీసీకే రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పల్లం తాతయ్య, ముత్యాల మోహన్, పాలకుంట శ్రీనివాసులు, కడప రమణ, నంద్యాల శ్రీపతి, నీరుగట్టి రమణ, పీర్ బాషా, వి.దొరస్వామి, అనంతపురం ఓబులేసు, కర్నాటక డి.ఎస్.ఎస్ నాయకులు మునెప్ప, శ్రీనివాసులు, మునివెంకటప్ప లతోపాటు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన బాస్, వీసీకే నాయకులు ఈసదస్సులో పాల్గొన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల తోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానాలు, భూమి పంపిణీ, జనాభా దమాషా ప్రకారం బడ్జెట్ లో వాటా, మద్యం షాపులు, క్వారీలు, ప్రభుత్వ కాంట్రాక్టు వర్కుల టెండర్లలో రిజర్వేషన్ల అమలు కోసం పోరాటం చెయ్యాలని సదస్సులో తీర్మానం చేశారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను సవరణించాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్రంలో కార్మికుల పనిగంటలను 8 నుంచి 13కు పెంచుతూ శాసనసభ, శాసనమండలి చేసిన తీర్మానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. పని గంటలు పెంపు నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా కనీస వేతనాలను ప్రభుత్వం సవరించలేదని, తక్షణమే కనీస వేతనాలను ప్రస్తుత ధరలకనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, సీపీఐ మదనపల్లి పట్టణ కార్యదర్శి మాధవ్, ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గజపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చలపతి నాయుడు, శ్రీనివాసులు, జానకి, లోకేష్,రవి తేజ, పార్వతి, నాగమ్మ,బాగ్యమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

అదిత్యలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే

విశాలాంధ్ర-మదనపల్లె: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక చంద్రమకులపల్లె లో మొక్కలు నాటారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి మాట్లాడుతూ పచ్చదనాన్ని విస్తరించడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, గ్రామీణ ప్రాంతాలలో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటం, కాలుష్యాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి రాయుడు మాట్లాడుతూ చెట్లు భూమి ఉష్ణోగ్రత తగ్గించడంలో జీవవైవిధ్యాన్ని కాపాడడంలో కీలకమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలుగుతామని విద్యార్థులు పుస్తకాలతో పాటు సమాజం పట్ల బాధ్యతను కూడా నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు బి దర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమం నందు గల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణంలో విద్యార్థిని, విద్యార్థులు కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణతో కలిసి మొక్కలు నాటారు. జాతీయ యసేవా పథకం ద్వారా మా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు వివిధ రకాల సేవా కార్యక్రమాల్లో ఎప్పటి నుంచే పాల్గొంటున్నారని అన్నారు. అలాగే ప్రస్తుత దసరా ఉత్సవాల్లో కూడ మా కళాశాల విద్యార్థులు ఆలయాల నందు క్రౌడ్స్ కంట్రోల్ చేసే దానికి సేవలు అందిస్తున్నారని, ఆలయానికి వచ్చిన భక్తులకు ఒక క్రమ పద్ధతిలో పంపిస్తూ జాతీయ సేవా పథకం కింది సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పృథ్వీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శారదా భవాని, కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, సలీం, మౌనయ, దావీద్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కాలజ్ఞాని సేవలో పులివెందుల భక్తులు

విశాలాంధ్ర-పులివెందుల: కడప జిల్లా బి మఠంలో కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారిని పులివెందులకు చెందిన కొమెర హరినాథ్, బిజెపి నాయకుడు లక్ష్మయ్య, అలాగే టౌన్ ఆఫ్ ఎండోమెంటు టెంపుల్ కమిటీ మెంబరు పొట్టిపాటి మాధవాచారిలు బుధవారం కలుసుకున్నారు. దేవీ శరన్నవ రాత్రుల సందర్భంగా కాలజ్ఞాని పాటు జగన్నాత ఈశ్వరీదేవి గారిని దర్శించుకున్నట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం మఠాధిపతులు కలుసుకున్నట్లు వారు తెలిపారు.

భాగవతులను అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-లింగాల: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా భాగవతులను అవమానించిన శ్యామసుందర్‌రెడ్డి అను వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి బుధవారం లోపాట్నూతల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో భాగవత సప్తాహం కార్యక్రమం సందర్భంగా చివరి రోజు అనగా మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు రావాల్సిందిగా సామాజిక మధ్యమాల్లో సందేశం పంపించామన్నారు. అయితే గ్రూప్ అడ్మిన్ గా ఉన్న శ్యామసుందర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని తప్పుపడుతూ పెద్దలు, భాగవతులను కించపరచేలా మరో సందేశం పెట్టారన్నారు. ఇందుకు స్పందించిన కొంత మంది గ్రామస్థులు సభ్య సమాజం తలదించుకునే విధంగా భాగవతులు, పెద్దలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్యామసుందర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో గ్రామస్తులు కోరారు.

పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర-లింగాల: మండలంలోని దొండ్లవాగు గ్రామంలో బుధవారం పంట పొలాలను ఏవో రమేష్ పరిశీలించారు. లింగాల మండలంలోని దొండ్ల వాగు గ్రామంలో లో ఇప్పటి వరకు జరిగిన పంట నమోదు వివరాలను సక్రమంగా జరిగిందా లేదా అనే విషయమై ఆయన స్థానిక రైతు సేవా కేంద్ర సిబ్బంది గంగాధర్‌తో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు దొండ్ల వాగు పొలంలోని పి.రామ దేవి సాగు చేసిన వేరుసెనగ పంటను అలాగే నిరంజన్ రెడ్డి అనే రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటను తనిఖీ(సూపర్ చెక్)చేయడం జరిగింది. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం గంగాధర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు .

శారద దేవి అలంకారంలో దర్గా మాత

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీలోని శ్రీ దర్బారు సాయి నగర్‌లో వెలసిన సమర్ధ సద్గురు దర్గా మాతాజీ శరన్నవరాత్రి ఉత్సవాలులో భాగంగా 3రోజు బుధవారం శారద దేవి అలంకారములో శ్రీ దుర్గా మాత ప్రజలకు దర్శనమిచ్చింది. ఉదయం మహాగణపతి పూజ. గంగాపూజ మృత్తిక పూజ. నవగ్రహ పూజ. కలిశ స్థాపన. సద్గురు దర్గా స్వామీజీ. సద్గురు దర్గా మాతాజీ కి అభిషేకాలు అలంకరములు మహా మంగళహారతితో ముగించారు. ఈ ఉత్సవాలకు వచ్చిన భక్తులు అందరికీ అన్న దానం నిర్వహించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : దశరా శరన్న వరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం పాత బజారులోని శ్రీగంగమ్మతల్లి ఆలయం వద్ద కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, రాహుల్ రెడ్డి స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్జున్‌కు వైవియు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర - కడప వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్కాలర్ అర్జున్ కురువకు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈయన ఆ శాఖ ప్రొఫెసర్ సి నాగరాజు పర్యవేక్షణలో 'హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ సెంటిమెంట్ అనాలసిస్ యూజింగ్ టెక్స్ అండ్ ఎమోజిస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు వై వి యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు. అర్జున్ రాసిన పరిశోధన పత్రాలు ఎస్‌సిఐ, స్కోపస్ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. అలానే నెట్, సెట్ అర్హతను సాధించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న అర్జున్‌ను ఈ సందర్భంగా వైవియు విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి అభినందించారు.

ఎవరెన్ని కుట్రలు పన్నినా రెడ్డప్ప గారి కుటుంబానిదే ఆధిపత్యం

టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని కోర్టు మేయర్‌ను దోషిగా నిర్ధారించినా కుర్చీ కోసం ప్రాకులాడడానికి సిగ్గుండాలని, మేయర్ సురేష్ బాబు తీరుపై టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి పరోక్షంగా మండిపడ్డారు. ద్వారకా నగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టం తెలిసిన వ్యక్తిగా అవినీతి ఆరోపణలపై రాజీనామా చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలే తప్ప, కుర్చీ కోసం కోర్టులకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. మేయర్లుగా ఉన్న వ్యక్తులు అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదు చేయగా ఆయనను తొలగించడం జరిగిందని, న్యాయస్థానానికి వెళ్లి స్టే తెచ్చుకోవడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కార్పొరేషన్‌లో అవినీతి జరిగింది. న్యాయస్థానంలో రుజువు కావడంతో ప్రభుత్వం మేయర్ పదవి నుండి ఆయనను తొలగింపు చేసిందని, ఇక ఏ న్యాయస్థానానికి వెళతారని నిలదీశారు. ఇక కోర్టుకు వెళ్లే అవకాశం లేదన్నారు. తప్పు వేరు, అవినీతి వేరు, కార్పొరేషన్ వారి అవినీతితో కంపు కొడుతుంది అని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికలకు ఆరు నెలల వ్యవధి ఉందని, అలాగే కుర్చీకి అంటిపెట్టుకొని ఇంకాస్త అవినీతి తో సొమ్ము వెనకేసుకుందామని ఆలోచిస్తున్నారేమో అని ఆయన అనుమానాన్ని వ్యక్త పరిచారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అవినీతి నాయకులు ఓట్ల కోసం వస్తే, ప్రజలు తరిమికొట్టాలని ప్రజలకు తెలియజేశారు. ప్రజలు టిడిపి అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఈనెల 28న ఉదయం 10 గంటలకు షామీరియా, లా కాలేజీల వద్ద బ్రిడ్జిల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తున్నామని అన్నారు. అసమ్మతి వాదులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఆధిపత్యం రెడ్డప్ప గారి కుటుంబానిదే అని ఒక ప్రశ్నకు సూటిగా బదులిచ్చి, పార్టీలో అసమ్మతి నాయకుల తీరుపై నీళ్లు చల్లారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సూర్యనారాయణ రెడ్డి, నగర అధ్యక్షులు మన్సూర్ అహ్మద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోధనలో కృత్రిమ మేధాను ఉపయోగించాలి :వైవియు వీసీ

విశాలాంధ్ర-కడప వైవీయూ : కృత్రిమ మేధాను బోధన, పరిశోధనలో వినియోగిస్తే విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు సృష్టిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి ఉషా విభాగం ఆధ్వర్యంలో "క్రియాశీల బోధన కోసం కృత్రిమ మేధస్సు (ఎఐ) సాధనాలు, సాంకేతిక పద్ధతులు" అనే అంశంపై జాతీయ స్థాయి ఒకరోజు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు నిర్వాహకులను అభినందించి, విద్యార్థులకు ఇచ్ఛిక కోర్సుల ద్వారా అనేక సబ్జెక్టులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉందన్నారు. సాంకేతికత విధానాలు విద్యార్థుల అధ్యాపకుల ఇద్దరికీ జ్ఞానం పెంపొందించటానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమం బోధన ప్రతిభను పెంపొందించడానికి, అధ్యాపకులకు తాజా ఎఐ సాధనాలు వినియోగమవుతాయన్నారు. రిజిస్ట్రార్ ఇన్ చార్జ్ ప్రొఫెసర్ పి.పద్మ మాట్లాడుతూ కోవిడ్-19 మహమ్మారి కాలం నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలు అలవాటు అయ్యాయన్నారు. టెక్నాలజీ ఎంత ముఖ్యమయ్యాయో చర్చించారు. వై.యు.వి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు నిర్వాహకులను ప్రశంసించారు. ముఖ్య వక్తగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి నుండి విచ్చేసిన డా. జి.వి. రమేశ్ బాబు మాట్లాడుతూ 1945 నుండి 2025 వరకు కృత్రిమ మేధస్సు అభివృద్ధి చరిత్రను వివరించి, బోధన, పరిశోధన, ఆరోగ్యం, సాధారణ జీవనశైలి వంటి విభాగాల్లో ఉపయోగించే పలు ఎఐ సాధనాలను పరిచయం చేశారు. పి.ఎం. ఉష ప్రాజెక్ట్ సమన్వయకర్త డా. టి. చంద్రశేఖర్ మాట్లాడుతూ యూనివర్సిటీకి రూ. 20 కోట్ల నిధులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

తెదేపా రాష్ట్ర అధ్యక్షుని కలిసిన మండల నేతలు

విశాలాంధ్ర - సుండుపల్లె : తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజుతో మండల నాయకులు శివరామనాయుడు, హరికృష్ణలు బుధవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి సుండుపల్లి మండలంలోని పలు సమస్యల దృష్టికి తీసుకెళ్లినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోనే ముడుమాల పంచాయతీ పరిధిలో కేశవరం సమీపంలో నేషనల్ హైవే పక్కనే నూతనంగా శ్రీ వెంకటేశ్వర ఫిలింగ్ స్టేషన్ భారతి పెట్రోల్ బంకును ఏర్పాట్లు పోరుమామిళ్ల పట్టణవాసులు సీత బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బద్వేల్ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, కూటమి ప్రభుత్వానికి చెందిన షరీఫ్ బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముడుమాల సర్పంచ్ భర్త వేమిరెడ్డి ముని రెడ్డి, సీతా బ్రదర్స్ మహేష్ సురేష్ రమేష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన భారతి పెట్రోల్ డీజిల్ సరసమైన ధరకు నేషనల్ హైవే కు దగ్గర్లోనే ఏర్పాటు చేయడం జరిగిందని వాహనదారులు నాణ్యమైన డీజిల్ పెట్రోల్ డీజిల్ సరసమైన ధరలకు అనుగుణంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇక్కడ ప్రాంతా రైతులు అంగంపల్లి ఇటుకలపాడు, పలుగురాళ్లపల్లె, మల్లేపల్లి చుట్టుపక్కల ప్రజలకు రైతులకు వాహనాలకు వాహనం పెట్రోలు డీజిల్కు వెళ్లాలంటే పోరుమామిళ్లకు వెళ్లే పెట్రోల్ డీజిల్ తెచ్చుకునే వారన్నారు. ప్రతి వాహన దారులు సద్వినియోగ చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, పెట్రోల్ బంక్ యాజమాన్యం వారి బంధువులు పలువురు రాజకీయ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి నుండి చెత్తను సేకరించాలి :కమిషనర్ మనోజ్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి, ప్రజా వైద్యాధికారి డాక్టర్ సౌదాగిరి రమేష్ లు బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఈస్ట్, సౌత్‌జోన్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా కమీషనర్ 22వ డివిజన్‌లో క్లాప్ వెహికల్‌ని ఆకస్మిత తనిఖీ చేసారు. ప్రతీ ఇంటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని డ్రైవర్‌ని ఆరా తీశారు. తప్పని సరిగా ప్రతీ ఇంటి నుండి చెత్తను సేకరించాలని హెచ్చరికలు జారీ చేసారు. ఈ సందర్భంగా కమీషనర్ ఉక్కాయపల్లి నందు ఉన్న ఓల్డ్ డంపింగ్ యార్డ్, ప్రస్తుత ఎకో పార్క్ నందు విజిట్ చేసారు. ఈ పార్క్‌ని ప్రజలకి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, హెచ్చరికలు జారీ చేసారు. అనంతరం ఎంఎస్ఆర్ హిల్ వాలీకి వెళ్ళు రోడ్‌ని సందర్శించారు. సంజన్న సర్కిల్ నందు సందర్శించారు. ఎక్కడ జరుగుతున్న రోడ్ వర్క్స్‌ని తనిఖీ చేసారు. అలాగే ప్రజలకి ట్రాఫిక్ ఇబ్బంది ఉండకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ నందు ఉన్న అన్నా క్యాంటీన్ నందు సందర్శించారు. అక్కడ ప్రజలతో మమేకమై భోజనం గురించి అలాగే సిబ్బంది పని తీరుని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు.ఆర్ట్స్ కళాశాల మైదానం నుండి డీఎస్సీకి అభ్యర్థులు వెళుతున్న సందర్భంగా శానిటేషన్ మెరుగు పడేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఈలు ధనలక్ష్మి, విజయ్ కుమార్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ సుబ్బయ్య, పూజిత్ రెడ్డి, రాజా, పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి

విశాలాంధ్ర-రాయచోటి:సమాజంలోని మహిళలందరూ ఆరోగ్యంగా ఉంటేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని డాక్టర్ నవ్యత తెలిపారు. రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి పట్టణానికి చెందిన నవ్యత క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్.వమర్తి నవ్యత ఎంబిబిఎస్ ఎండి(డెర్మటాలజీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థనారి-శశక్తు పరివార అభియాన్ పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళల ఆరోగ్యం కోసం అనేక చర్యలు చేపట్టిందని, మహిళ సాధికారత సాధించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని అభిప్రాయపడ్డారు. కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్ మాట్లాడుతూ విద్యార్థి దశలో జాతీయ సేవా పథకం ప్రతి విద్యార్థి జీవితాన్ని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందని వివరించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ పథకం ద్వారా విద్యార్థుల్లో సేవా గుణాన్ని అలవర్చి, సమాజంలో ఐక్యత ఏర్పరిచి, ఆచార సంప్రదాయాలు పై అవగాహన ఏర్పరిచి గౌరవప్రదమైన పౌరునిగా తీర్చిదిద్దుతుందని వివరించారు. సమావేశంలో ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ తుమ్మల స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్, సుఖ వ్యాధుల గురించి వివరించారు అందరూ సహకరించి ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ సభ్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథిని, విశిష్ట అతిథిగా హాజరైన ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ తుమ్మల స్వాతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.